ప్రజాశక్తి

శుక్రవారం 15 డిసెంబర్ 2023 5 కర్నూలు





విమానాశ్రయంలో అశోక్ ధావలే, విజూకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న ఆహ్వానసంఘం నాయకులు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

- అంగన్వాడీలకు అండగా ఉంటాం - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్
- టిడిపి, కాంగ్రెస్, సిపిఐ, జనసేన సంఘీభావం - మూడో రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. గురువారం మూడో రోజూ కర్నూలు ధర్నా చౌక్‌లో అంగన్వాడీలు దీక్ష చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు. ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప అధ్యక్షతన దీక్షలు చేపట్టారు. టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జీ టిజి.భరత్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జనసేన నాయకులు రేఖా గౌడ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, జిల్లా నాయకులు ఎం.గోపాల్, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకులు పి.నిర్మలమ్మ, టిఎన్‌టియుసి నాయకులు అశోక్, నరసింహులు, న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఐఎఫ్‌టియు నాయకులు తిరుపాల్, వెంకటస్వామి, అల్లప్ప శిబిరాన్ని సందర్శించి అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి సచివాలయ సిబ్బంది ద్వారా ప్రయత్నం చేస్తున్నారని, అంగన్వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలకు జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కంటే రూ.వెయ్యి వేతనం అదనంగా ఇస్తానని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాదిరిగా జీతాలు పెంచాలని కోరారు. జీతాలు పెరిగేంత వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని, దానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ... అంగన్వాడీలకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇతరులను పెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే అంగన్వాడీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టిడిపి కర్నూలు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ టిజి.భరత్ మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు పెంచిన రూ.10 వేల వేతనమే అంగన్వాడీలకు ఇస్తున్నారని, అదనంగా ఏమీ పెంచలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే పక్క రాష్ట్రాల్లో ఉన్న ఎక్కువ జీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతు కూలీ సంఘం నాయకులు వెంకటస్వామి, అల్లప్ప, తిరుపాల్ మాట్లాడుతూ... బెదిరింపుల ద్వారా ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. అంగన్వాడీ నాయకులు రుక్మిణి, సునంద, చౌడేశ్వరి, సౌభాగ్య, కవిత, ప్రవీణ, బాల దుర్గమ్మ, విజయ, నాగమణి, మల్లేశ్వరి, సిఐటియు నగర కార్యవర్గ సభ్యులు ఎస్.మహ్మద్ రఫీ పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్




సమ్మెలో పిల్లాపాపలతో పాల్గొన్న అంగన్వాడీలు

ముస్తాబైన కర్నూలు

- నేటి నుంచి ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాగనున్న ఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కర్నూలు నగరం సిద్ధమైంది. కర్నూలులోని కలెక్టరేట్ కూడలి, సుందరయ్య కూడలి, ఆర్ఎస్ రోడ్డు కూడలి, గాయత్రి ఎస్టేట్ కూడళ్లను ఎఐకెఎస్ తోరణాలతో ముస్తాబు చేశారు. ప్రధాన రోడ్ల మధ్య భాగాల్లో తోరణాలు, జెండాలతో అలంకరించారు. సమావేశాల కోసం గురువారం సాయంత్రానికే ముఖ్య నాయకులు కర్నూలుకు చేరుకున్నారు. వారికి ఆహ్వాన సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఎఐకెఎస్ అఖిలభారత అధ్యక్షులు అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు విజూకృష్ణన్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో ఆహ్వాన సంఘం నాయకులు పిఎస్.రాధాకృష్ణ, గురుశేఖర్ స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో పలువురు నాయకులకు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆహ్వాన సంఘం నాయకులు నగేష్, అబ్దుల్లా స్వాగతం పలికారు. సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రారంభ సభ, కార్యదర్శి నివేదిక ఉంటాయి. మధ్యాహ్నం కర్నూలు సుందరయ్య కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ రైతు ర్యాలీ ఉంటుంది. శ్రీరామ థియేటర్, మౌర్యా ఇన్ కూడలి, రాజ్ విహార్ కూడలి, చిల్డ్రన్స్ పార్క్, ఓల్డ్ కంట్రోల్ రూం, కొండారెడ్డి బురుజు మీదుగా సాగనుంది. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 16, 17న కార్యదర్శి నివేదికపై చర్చలు, తీర్మానాలు ఉండనున్నాయి. 17న సాయంత్రానికి సమావేశాలు ముగియనున్నాయి. బస్టాండు సమీపంలోని సత్య ఇన్ హోటల్‌లో ఈ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల వేదికకు స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళనాడు రైతు ఉద్యమ నాయకులు శంకరయ్య పేరుతో శంకరయ్య నగర్‌గా నామకరణం చేశారు. సమావేశాలకు 27 రాష్ట్రాల నుంచి 140 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, టి.సాగర్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్ హాజరుకానున్నారు. వారితో పాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, నోయిడాలో రైతు ఉద్యమం నడిపిన నాయకులు, వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితులు రానున్నారు.



ముస్తాబైన సుందరయ్య సర్కిల్

వైసిపిలో మళ్లీ మొదలైన గ్రూపు తగాదా

- ఎస్‌వి మోహన్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్ గ్రూపుల మధ్య వివాదం
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో రచ్చ

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు నియోజకవర్గం వైసిపిలో ఎస్‌వి.మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ గ్రూపుల మధ్య తగాదాలు మరోసారి బయటపడ్డాయి. ఈనెల 17న కర్నూలు నగరంలో నిర్వహించనున్న సామాజిక బస్సుయాత్ర కార్యక్రమం జయప్రదం కోసం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో గురువారం ఇరు గ్రూపుల మధ్య రచ్చ మొదలైంది. సమావేశంలో సామాజిక బస్సు యాత్రను ఉద్దేశించి రీజినల్ కోఆర్డినేటర్ పొన్నం రామ సుబ్బారెడ్డి మాట్లాడేందుకు ఉపక్రమించగా... ఎస్‌వి మోహన్ రెడ్డి గ్రూపునకు చెందిన కురువ మల్లికార్జున మాట్లాడారు. గత అనేక ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్న కార్యకర్తలును నిర్లక్ష్యానికి గురవుతున్నారని, వారిని ఆదరించాలని వేదికపై చెప్పుకొచ్చాడు. మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ శ్రీరాములు కలుగజేసుకొని ఇది రాజకీయాలకు సమయం కాదని, తన ప్రసంగాన్ని ఆపివేయాలని లేసి వారించబోయారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రూపుల కార్యకర్తలు ఒకరిని ఒకరు దూషించుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దీంతో సమావేశం రసాభాసగా మారింది. నాయకులు కలుగజేసుకొని కార్యకర్తలకు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎస్‌వి మోహన్ రెడ్డి గ్రూపులకు సర్ది చెప్పుకున్నారు. పొన్నం రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఇది రాజకీయాలకు వేదిక కాదని, బస్సు యాత్ర జయప్రదం కోసం మాత్రమే మాట్లాడాలన్నారు. పార్టీ పరువును బయటపడేలా చేయొద్దన్నారు. వైసిపి ఓ పెద్ద కుటుంబమని, ఇలాంటి చిన్న చిన్న కలహాలు అన్నదమ్ముల మధ్య సర్వసాధారణమైనవని, ఐకమత్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కోరారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

'ఆడుదాం ఆంధ్ర'కు క్రీడాకారుల నమోదు

- జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ఆడుదాం ఆంధ్ర క్రీడలకు క్రీడాకారులను వంద శాతం నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుండి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలోనూ గ్రామస్థాయిలోనూ ఖాళీగా ఉన్న గ్రౌండ్ లను గుర్తించాలన్నారు. ఆడుదాంఆంధ్రకు సంబంధించి క్రీడల నిర్వహణకు క్రీడాకారులను వంద శాతం నమోదు చేసేలా ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మహిళ క్రీడాకారులను కూడా ప్రోత్సహించే దిశగా వారికి అవగాహన కల్పించి వారిని కూడా క్రీడలలో భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా నిర్వహణకు అవసరమైన మైదానాలను త్వరితగతిన గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామ పంచాయతీలకు వెళ్ళినప్పుడు దండోరా వేయించి అందరూ పాల్గొని యాత్రకు సంబంధించిన ప్రతిజ్ఞ చేసేలా ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి గూడూరు, ఎమ్మిగనూరుకు ఒఆర్ఐలు వచ్చాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి అయిన వెంటనే 9(2) నోటీసులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్ఒ కె మధుసూదన్ రావు, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోదాముల నిర్మాణంలో కర్నూలు అగ్రగామి

ప్రభుత్వ గోదాముల నిర్మాణంలో కర్నూలు జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా ఉన్నతా ధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య , జిల్లా అధికారులు మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జగనన్న పాల వెల్లువ స్కీమ్ కోసం డిసిసిబి ద్వారా ఆధార్ కార్డు , మొబైల్ సౌకర్యం వినియోగించుకుని కేవలం అరగంటలో లోన్ ఇప్పించే చర్యలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మొబైల్ యాప్ ద్వారా పాడి పరిశ్రమకు విరివిగా లోన్లు ఇప్పించి పాల ఉత్పత్తి అభివృద్ధికి కలెక్టర్లు కృషిచేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ (ప్రధానమంత్రి జన్‌మాన్) పథకం ద్వారా ఆదివాసీలకు ఇల్లు నిర్మించు కార్యక్రమాలు అమలు అయ్యేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న జెసి నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యు ఎంఎ. హాఫీజ్ ఖాన్

సామాజిక బస్సు యాత్రను జయప్రదం చేయండి


కర్నూలు ఎమ్మెల్యు ఎంఎ. హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల 17న వైసిపి చేపట్టిన సామాజిక బస్సుయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ కోరారు. కర్నూలు నగరంలోని కొత్త ఈద్ గాలో ఉన్న గోల్ కొండా ఫంక్షన్ హాల్లో జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ కర్నూలు నియోజకవర్గంలో డిసెంబర్ 17న ఆదివారం సాయంత్రం 1టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ లో యువకులు యువత ప్రతి ఒక్కరూ పాల్గొని యాత్ర సభ విజయవంతం చేయాలని పిలుపుచ్చారు. సామాజిక సాధికార యాత్ర ముఖ్య ఉద్దేశం యువతకు వివరించారు. జగనన్న అందిస్తున్న పరిపాలన సంక్షేమం అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమం జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్ అధ్యక్షత నిర్వహించారు. సితార పర్వేజ్ ఖాన్, సితార ఇర్ఫాన్, అది మోహన్ రెడ్డి, ఫరూక్, షాకీర్, వహీద్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రాబోయే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని టిడిపి పాణ్యం ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 37 వ వార్డ్ రాముల వారి ఆలయం కాలనీలలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు పాణ్యం మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇంచార్జి గౌరు చరితరెడ్డి వివరించారు. నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షులు కె.పార్వతమ్మ, 37వ వార్డ్ ఇంచార్జి కృష్ణ వెనమ్మ, వార్డ్ క్లస్టర్ ఇంచార్జి జనార్ధన్ ఆచారి, టిడిపి నాయకులు అడ్వకేట్ నాగ ముని, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్ బిసి సెల్ రాష్ట కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్, అర్బన్ నాయకులు ధనుంజయ, నాగేశ్వరరావు,కోట్ల తిమ్మా రెడ్డి పాల్గొన్నారు.

కరువు రైతును ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం

4వ రోజు అలరించిన సంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో కరువు తాండవిస్తోందని కరువు పీడిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య అన్నారు. ఎఐకెఎస్ ఆల్ ఇండియా కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో ప్రజానాట్యమండల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు నాలుగవ రోజు అత్యంత ఉత్సాహపరితంగా ప్రజలను అలరించాయి. కళాకారులు ప్రదర్శించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పౌరాణిక నాటకం ప్రజల్లో స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, మేయర్ బివై.రామయ్య, ఛీఫ్ పాటర్న్ ఆర్జా రామకృష్ణ, టిజివి. కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య హాజరయ్యారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ అకాల వర్షం అతివృష్టి అనావృష్టి రాష్ట్రానికి చేటుగా మారిందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై దాడి చేస్తున్నాయన్నారు. వ్యవసాయం జూదంగా మారిందన్నారు. ఇతర దేశాల్లో రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుంటే ఇక్కడ మాత్రం అది కొరవడిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.17 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. రైతుల రుణాలను ప్రభుత్వాలు ముక్కు పిండి వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కరువు పీడిత రైతులను, తుఫాను బాధిత రైతులను ఆదుకోవాలని అన్నారు. మేయర్ బివై రామయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వం రైతుల పక్షాన పనిచేస్తుందని, తుఫాన్ బాధితులనాదుకోవడానికి ప్రభుత్వం స్పందించిందన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యంత కరువు పీడిత ప్రాంతంగా అనంతపురం జిల్లా ఉండేదని, ఇప్పుడు ఆ స్థానాన్ని కర్నూలు జిల్లా ఆక్రమించిందన్నారు. రైతుల సమస్యలను మించేలా ప్రజానాట్యమండలి చేపట్టిన సాంస్కృతిక సంబరాలు అభినందనీయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. అతిథులకు ప్రజానాట్యం మండలి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జ్ఞాపకాలను అందజేశారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంపీ బసవరాజు, నాగరాజు, నాయకులు బతుకన్న, నోమేశ్వరి, నాగ సుంకన్న, లక్ష్మీనారాయణ, బాలన్న, బజారి, నాగ స్వాములు, సురేష్, ముని, సరిత, లక్ష్మి, రాజు, పలువురు విద్యార్థులు , కళాకారులు పాల్గొన్నారు.



కళాకారిణికి జ్ఞాపికను అందజేస్తున్న బివై.రామయ్య, పత్తిఓబులయ్య , జి. రామకృష్ణ

మూడోరోజూ సాగిన అంగన్‌వాడీల పోరాటం



కోడుమూరులో మాట్లాడుతున్న గఫూర్ మియ్యా

ప్రజాశక్తి- కోడుమూరు

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం కొనసాగించాలని సిఐటియు నాయకుడు గఫూర్‌మియ్యా, జె.మోహన్, వీరన్న సూచించారు. కోడుమూరులో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మూడవరోజు సంత మార్కెట్‌లో నిరసనగలం వినిపించారు. వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ఎంపిడిఒలకు వాలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగుల ద్వారా సెంటర్లను ఓపెన్ చేసి నడిపించాలని ఆదేశాలు ఇవ్వడం చాలా దుర్మార్గమైన పని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలు ఎంతో కాలం నుండి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించలేక పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల ఇబ్బందులు పడుతూ అలాగే ఉద్యోగం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఉద్యోగాలను తొలగిస్తాం అని రకరకాల భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులు చేసినా వారు చేసే బెదిరింపులకు భయపడే ప్రసక్తిలేదని సిఐటియు నాయకులు అంగన్వాడి సంఘం నాయకులు విజయభారతి, సుహాసిని సూలమ్మ ,అరుణ అనంతమ్మ రజియా ప్రాజెక్టు నాయకులందరూ అంగన్వాడీ కార్యకర్తలకు ఎంతో ధైర్యాన్ని నింపుతూ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడాలన్నారు.గూడూరు, బెలగల్, కోడుమూరు మండలాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

మద్దికేర: మద్దికేర మండల మండల పరిధిలోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెనిరసన పత్తికొండ ఊరు వాకిలి దగ్గర 3వ రోజు కొనసాగింది. సిఐటియు మద్దికేర మండల కార్యదర్శి బురుజుల రాముడు మాట్లాడారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె విరమించేది లేదని నాయకులు ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కాంతమ్మ పద్మజ షాజహాన్, జిల్లా ఉపాధ్యక్షులు శోభ, సిఐటియు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మధు పాల్గొన్నారు.



మద్దికేర: అంగన్‌వాడీల సమ్మెలో మాట్లాడుతున్న బి.రాముడు



కర్నూలు ఓల్డ్ సిటీలో రెడ్ షర్టు వాలంటీర్ల కవాతు

ఎఐకెఎస్ బహిరంగ సభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా కర్నూలు పాత బస్టాండులో 15న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జమ్మి చెట్టు నుండి కిడ్స్ వరల్డ్ పార్క్ వరకు సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన కార్మికులు రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు. సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి మారేళ్ళ విజయ రామాంజనేయులు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, మైముద్, నగర ఉపాధ్యక్షులు కుమార్, సిఐటియు నగర నాయకులు రాంబాబు పాల్గొన్నారు. మారేళ్ళ విజయ రామాంజనేయులు మాట్లాడుతూ శుక్రవారం 15న కొత్త బస్టాండ్ నుండి మూడు గంటలకు ర్యాలీ బయలు దేరి సాయంత్రం నాలుగు గంటలకు పాత బస్టాండ్ లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికులను, ఉద్యోగ కార్మికులను, చిన్న వ్యాపారస్తులను, పేద మధ్యతరగతి ప్రజలను కోరారు. సిఐటియు హమాలి కార్మిక నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ చైర్మన్‌గా లాజరస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ తాత్కాలిక చైర్మన్ గా ఎండ్లూరి లాజరస్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులను డిసిసి అధ్యక్షుడు కె. బాబురావు అందజేశారు. డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు నియామక ఉత్తర్వులను లాజరస్‌కు అందజేశామన్నారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని చైర్మన్‌ను కోరారు.

బిఎస్‌పి అభ్యర్థిగా అరుణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ కర్నూలు అసెంబ్లీ తరపున అభ్యర్థిగా అరుణ్ కుమార్ పోటీ చేయనున్నట్లు రాష్ట్ర నాయకులు బాలయ్య, మల్లేకల్ ప్రకటించారు. గురువారం జరిగిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో సార్వత్రిక ఎన్నికల్లో అరుణ్ కుమార్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

ఉపాధి పనుల సామాజిక తనిఖీలో రూ.8,422 రికవరీకి ఆదేశాలు

- ప్రిసైడింగ్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి హామీ చట్టం కింద ఏడాది పాటు చేపట్టిన పనులపై బహిరంగ ప్రజా సామాజిక తనిఖీలో రూ.8,422 రూపాయలు రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలోని 21 గ్రామాల్లో వలసలు నివారించేందుకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులపై బహిరంగ ప్రజా సామాజిక తనిఖీలో రూ.8,422 రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.18 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ మొత్తం రూ.26,422లను సంబంధిత సిబ్బంది నుంచి వారంలోపు రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డ్వామా పీడీ మాధవీలత, అడిషనల్ పీడీ భాస్కర్, డిఒవి చంద్రశేఖర్, అంబుడ్స్‌మెన్ లోకేశ్వర్, ఏపీడీ మల్లికార్జున, ఇఒఆర్‌డి ప్రభావతి, పిఆర్ ఎఇ నరసింహులు, ఎపిఒ తిమ్మారెడ్డి, ఇసి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు నాగభూషణం

ప్రజాశక్తి - గోనెగండ్ల

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం యుటిఎఫ్ తయారు చేసిన ఎస్ఎస్‌సి మెటీరియల్‌ను గురువారం అందజేశారు. యుటిఎఫ్ నాయకులు గుమ్మల బాబు ఆధ్వర్యంలో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా, అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి మార్కులు సాధించడం కోసం ఎంతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత ఈ మెటీరియల్ తయారు చేయించినట్లు తెలిపారు. అలాగే సులభంగా అన్ని అంశాలు అర్థమయ్యే రీతిగా ఈ మెటీరియల్ తయారు చేసి విద్యార్థులకు చాలా తక్కువ ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. దీనిని సరైన పద్ధతులలో ఉపయోగించుకుంటే ప్రతి విద్యార్థి కూడా మంచి మార్కులతో పాస్ కావచ్చని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు అబ్దుల్ సలీం, తాజుద్దీన్, ఉమా, రంగస్వామి, ఉపాధ్యాయులు భాస్కర్, ఉస్మాన్, మురళీకృష్ణ, శివశంకర శాస్త్రి, రవికుమార్, చిరంజీవి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమ పాలన జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక 33వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అవినీతికి అవకాశం లేకుండా సుపరిపాలన అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంకు చైర్మన్ కొమ్ము రాజశేఖర్, కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, వైసిపి 33వ వార్డు ఇన్‌ఛార్జీ వడ్డే వీరేష్, వైసిపి నాయకులు బుట్టా రంగయ్య, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, రమేష్, వడ్డే రంగన్న, సోమేష్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న జగన్మోహన్ రెడ్డి

పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు

- మూడో రోజూ అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. గురువారం ఆదోనిలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, జానకి అధ్యక్షతన భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి, అక్కడ మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఆర్‌సిసి అధ్యక్షులు ఎసి.శ్రీకాంత్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి, మహిళా సంఘం నాయకులు సుజ్ఞానమ్మ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీ సమస్యలను జగన్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు పెంచాలని, పింఛను సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని కోరారు. రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, సూపర్‌వైజర్ ప్రమోషన్‌కు 50 ఏళ్లు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, ఈరన్న, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న, ముక్కన్న, మండల నాయకులు రామాంజి, వీరారెడ్డి, అంగన్వాడీ వర్కర్లు పద్మ, రేణుక, సరోజ, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వానా, ఎఐటియుసి నాయకులు జానకి, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (జెఎసి) ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. అలాగే సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మోకాళ్లపై కూర్చుని దీక్షలు చేపట్టారు. దీక్షలకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సంఘీభావం తెలిపారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు గోవిందు, రాముడు, తిమ్మగురుడు, వీరేష్, ప్రసాద్, రాజు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, కృష్ణవేణి, నీరజ, బసమ్మ, వెంకట లక్ష్మి, నాగలక్ష్మి, పుష్పవతి, నాగశిరోమణి, పద్మ, శైలజ, నాగేశ్వరమ్మ, సుబ్బమ్మ, గ్రేసమ్మ, మేరీ, నీరజ, మల్లీశ్వరి, పుష్ప, జయమ్మ, శంషాద్ బేగం, సుజాత, రాగమ్మ, ప్రభావతి, సునంద, వెంకటేశ్వరమ్మ, తులసీ, ప్రమీలమ్మ పాల్గొన్నారు. **ఆస్పరి** సిడిపిఒ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు జ్యోతి, విజయలక్ష్మిల అధ్యక్షతన మూడో రోజూ సమ్మెను కొనసాగించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, ఎంపిటిసి నరసన్న, సొసైటీ మాజీ చైర్మన్ నౌనేపాటి చౌదరి, మండల మాజీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు అమలయ్యే వరకు టిడిపి మద్దతుగా ఉంటుందని తెలిపారు. ఈ సమ్మెకు టిడిపి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అధినేత చంద్రబాబుతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలను విస్మరించిందన్నారు. ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి, రాజశేఖర్, ఉరుకుందప్ప, తెలుగు యువత నాయకులు రాజ్ కుమార్, మల్లేశప్ప, వీరేష్, సిద్ధు, ఆచారి పాల్గొన్నారు. **కౌతాళంలో** అంగన్వాడీల నిరవధిక సమ్మె మూడో రోజూ కొనసాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. అంగన్వాడీలకు రోజురోజుకు ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి మద్దతు పెరుగుతోందని నాయకులు తెలిపారు. గ్రామ సేవకుల సంఘం నాయకులు, ఐఎఫ్‌టియు నాయకులు మద్దతు తెలిపారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న, గ్రామ సేవకుల సంఘం నాయకులు ప్రహ్లాద, నాగరాజు, మారెప్ప, అనుమేష్, ఐఎఫ్‌టియు నాయకులు నాగేంద్ర, అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి, కాంతమ్మ, రత్నమ్మ, దీప్తి, చాముండి, రాధా, విజయలక్ష్మి పాల్గొన్నారు. **మంత్రాలయం** ఆర్‌టిసి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు కాంగ్రెస్ జనసేన నాయకులు లోకేష్ బి.లక్ష్మన్న హాజరై మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకమ్మ, సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, సిఐటియు నాయకులు ఆంజనేయ, సిఐటియు కోసిగి మండల కార్యదర్శి కె.రాముడు, ప్రాజెక్టు కన్వీనర్, అధ్యక్షులు విశాలాక్షి, వరలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు. **ఆలూరులో** అంగన్వాడీల సమ్మె మూడోరోజుకు చేరుకుంది. అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చుని నిరసన చేపట్టారు. ఈ సమ్మెకు సిపిఐ సీనియర్ నాయకులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం తాలూకా కార్యదర్శి హోతూరప్ప, శివ, సిపిఎం మండల కన్వీనర్ షాకీర్, కృష్ణ మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ, నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మి, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఆదోనిలో మద్దతు ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు



ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న బీవీ



ఆస్పరిలో మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు



కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 12, 13వ వార్డులో 'బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఓటర్ల జాబితాను పరిశీలించారు. టిడిపి నాయకులు ఆల్తాఫ్, వీరేష్ పాల్గొన్నారు.



పట్టణంలో పర్యటిస్తున్న బీవీ

విద్యుత్ పొదుపు.. ఉజ్వల భవిష్యత్తుకు మలుపు

- విద్యుత్ శాఖ ఇఇ సుధాకర్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్‌ను పొదుపుగా వాడితే భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ కుమార్ తెలిపారు. గురువారం ఆదోనిలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో 14 నుంచి 20 వరకు జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత అని తెలిపారు. 'విద్యుత్ పొదుపుతో ఉజ్వల భవిష్యత్తు' అనే అంశంపై 16న ఆదోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎడి పురుషోత్తం, ఎఇలు నాగభూషణం, సంతోష్, శారద, చెన్నయ్య పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం కురువలు ఐక్య బాట...

- మాజీ డిప్యూటీ మేయర్ శశికళ ఆధ్వర్యంలో సింహగర్జన మహాసభ

- మహాసభ విజయవంతానికి విస్తృత పర్యటనలు...

ప్రజాశక్తి-ఆలూరు

అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల వ్యవధి ఉండడంతో ఆలూరులో ఎన్నికల వేడి పుంజుకుంటుంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు కులసంఘం నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగానే బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కురువలుని పిలవబడే మాదాసి, మాదారి కురువలకు రాజకీయ పార్టీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ జిల్లాలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 24న రాజకీయ పార్టీలకతీతంగా కురువ సామాజికవర్గం ఐక్యమత్యం కోసం ఆలూరు డిగ్రీ కళాశాల ఆవరణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ మహా సభకు రాష్ట్రంలో కురువ సంఘం పెద్దలు హాజరవుతున్నట్లు తెలిసింది. మహాసభ విజయవంతానికి శశికళ, ఆమె భర్త కృష్ణమోహన్, సంఘం పెద్దలు 15 రోజులుగా పర్యటిస్తూ మద్దతు కూడగడుతున్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యంతో పాటు మాదాసి, మాదారి కురువ ఎస్సీ సర్టిఫికెట్ లాంటి సమస్యలను పరిష్కరించాలని మహాసభ వేదికగా డిమాండ్ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా మాదాసి, మాదారి కురువలు మెజార్టీగా ఉండడం వల్ల ఏ పార్టీ అయితే సీట్లు కేటాయిస్తారో ఆ పార్టీకి మద్దతు ఇవ్వాలనే ఆలోచనతో కులసంఘం నాయకులు ముందుకు వెళ్తున్నారు. మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు చేపట్టే మహా సింహ గర్జనతో తమ సీటుకు ఎక్కడ చేటు వస్తుందోనని స్థానిక ప్రజాప్రతినిధి అనుకొంటున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే సోషల్ మీడియాలో వైసిపి నాయకులు శశికళకు వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెడుతున్నట్లు తెలిసింది. జిల్లా పశ్చిమ ప్రాంతంలో పత్తికొండ, ఆలూరు, ఆదోని ప్రాంతాల్లో మాదాసి, మాదారి కురువలు ఎక్కువగా ఉన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

త్వరలోనే ఇంటి పట్టాలిస్తాం

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇంటి పట్టాలు అందని వారికి త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో పట్టాలు పంపిణీ చేస్తామని వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మంత్రాలయంలో జరిగిన పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. స్థానిక జగనన్న కాలనీలో సి.కృష్ణ అనే లబ్ధిదారుని గృహ ప్రవేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. మధుసూదనాచారి చేసిన గృహ ప్రవేశానికి హాజరైన వారు సత్యనారాయణ స్వామి పూజలో పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన 'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొన్న వారు మండలంలోని 20 సచివాలయాలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఇంటి పట్టాలు అందని వారికి త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. క్రీడల వైపు యువతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' చేపట్టారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, నాయకులు బొంబాయి శివ, ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి ప్రభావతి, కార్యదర్శులు వేణుగోపాల్, ఇస్రత్ బాష, వెంకటరత్నం పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

'ఎస్సీ కేటగిరిగా మార్చాలి'

ప్రజాశక్తి - ఆదోని



ఓసీ కేటగిరి కింద ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను ఎస్సీ కేటగిరికి మార్చాలని ఆదోనిలోని న్యూగాంధీ నగర్‌కు చెందిన దళితుడు బదినెహాళ్ హుసేని అధికారులకు మొర పెట్టుకున్నారు. గురువారం ఆయన మీడియా ముందు బిల్లును చూపిస్తూ తన ఆవేదనను వెళ్లబుచ్చారు. తన తల్లి బదినెహాళ్ ఈరమ్మ పేరుపై గత 40 ఏళ్ల క్రితం సర్వీసు తీసుకున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లులో ఓసీ కేటగిరిగా ఉన్నందున నెలకు రూ.వెయ్యి బిల్లులు వస్తోందన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పెయింటింగ్ ఆర్టిస్ట్ అయిన తాను బిల్లు చెల్లించుకోలేక ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. స్పందనలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం కూడా ఇచ్చామన్నారు. అధికారులు స్పందించి ఎస్సీ కేటగిరిగా మార్చి న్యాయం చేయాలని కోరారు.

బాధ్యతతో పని చేస్తేనే ఫలితాలు

- కొంతమంది అధికారుల అలసత్వం వల్ల ప్రజాప్రతినిధులకు చెడ్డ పేరు

- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం ఏ ఆదేశాలు ఇచ్చినా వాటిని బాధ్యతగా తీసుకుని పాటించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని, అప్పుడే ప్రభుత్వాలపై, ప్రజాప్రతినిధులపైనా ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడుతుందని ఎంపిపి జూటూరు హేమలత తెలిపారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య హాజరయ్యారు. సమావేశంలో వివిధ శాఖల పని తీరుపై వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఎఒ జయలక్ష్మి మాట్లాడుతుండగా వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచి నీలకంఠ కలుగజేసుకొని 'పంటలను ఈ-క్రాప్ నమోదు చేయడంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలసత్వం వహిస్తున్నారు. మిరప పంట తెగులు బారిన పడినా ఏ అధికారి కూడా చూసేందుకు, సూచనలు ఇచ్చేందుకు రావడం లేదు' అని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ-క్రాప్ లేకపోతే చాలామంది రైతులు కరువు పరిహారం నష్టపోతారని ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో చాలా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నా బెల్డోన, కాజీపురం రిజర్వాయర్లలో తాగునీరు కలుషితంగా మారాయని, ఫిల్టర్ చేయకుండా వదులుతున్నారని, రాబోయే కాలంలో ప్రజలకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని బెల్డోన సర్పంచి సమావేశం దృష్టికి తెచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఎంపిపి హేమలత మాట్లాడారు. రాబోయే వేసవి నాటికి ప్రతి గ్రామంలోనూ తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఫిల్టర్ లేకుండా తాగునీటిని సరఫరా చేయవద్దని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన భూసర్వే పనుల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై మండిపడుతూ వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపిడిఒకు సూచించారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి బాలన్న, ఎంఇఒ బాల నాయుడు, ఎపిఎం నాగార్జున, పిఆర్ ఎఇ చోళ రెడ్డి, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, వెటర్నరీ డాక్టర్ ప్రసన్నబాయి, సర్పంచులు గోవిందరాజులు, సావిత్రి, మల్లమ్మ, భీమా, వెంకటలక్ష్మి, ఎంపిటిసిలు భీమలింగ, సుంకన్న, మల్లికార్జున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

వైసిపి ప్రభుత్వంలో వికలాంగులకు అధిక ప్రాధాన్యత

- సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్

ప్రజాశక్తి - ఆస్పరి


వైసిపి ప్రభుత్వంలో వికలాంగులకు, డిజిటల్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటి విద్యార్థులతో సమానంగా చదువుకోలేక, తండ్రి లేని చిన్నారుల బంగారు భవిత కోసం ప్రభుత్వం డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులందరూ ట్యాబ్‌లు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక సాఫ్ట్ వేర్‌ను పొందుపరిచారని చెప్పారు. సామ్ సాంగ్ కంపెనీకి చెందిన రూ.28 వేల విలువ గల ట్యాబ్ అని తెలిపారు. ఆస్పరికి చెందిన ముగ్గురు వికలాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు బాబు, నాగరాజు, అల్లెన్న, ఐఈఆర్‌టి జ్యోతి పాల్గొన్నారు.

దళితుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించం

- జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితుల సమస్యల పట్ల అధికారుల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రంగయ్య, జిల్లా అధ్యక్షులు మల్లేష్ గురువారం పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా దళితుల సమస్యలపై పర్యటిస్తున్న సి.రంగయ్య దృష్టికి వచ్చిన సమస్యలను, చట్టపరంగా అన్యాయం జరిగిన దళితులకు న్యాయం చేసే విధంగా, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే వరకు పోరాడాలని జిల్లా నాయకులను కోరారు. స్పందించని అధికారుల వివరాలు తనకు ఇవ్వాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా సామాన్యులకు ఎక్కడ అన్యాయం జరిగినా జై భీమ్ యువదళం నాయకులు అండగా నిలబడాలని సూచించారు. కోర్టు వ్యవహారాలు ఉంటే దళిత హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్తామని, దళితులు ఎవరూ అధైర్య పడొద్దని తెలిపారు. నియోజకవర్గం మల్కాపురం గ్రామ సమస్యలపై స్పందించిన తహశీల్దార్ గ్రామాన్ని సందర్శించి దళితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. నల్లన్న, జిల్లా నాయకులు బలరాం, రాముడు, గ్రామ పెద్దలు తిక్కన్న, అంజనయ్య, వీరేష్, కృష్ణయ్య, లక్ష్మీకాంత, నల్లారెడ్డి, భీమన్న, నాగరాజు, నాగేంద్ర, గుండు అయ్యప్ప పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రంగయ్య

'చేయూత'కు మినహాయించాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

వైఎస్ఆర్ చేయూత పథకం కింద 45 ఏళ్లు నిండిన మహిళలకు షరతుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎఐవైఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు గిరి, అధ్యక్ష, కార్యదర్శులు అంజిత్ గౌడ్, రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదోనిలోని 35వ వార్డు సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైఎస్ఆర్ చేయూత పొందుతున్న మహిళలకు ఇంటి గుత్తా, కుళాయి గుత్తా లేకపోతే వైఎస్ఆర్ చేయూతకు అనర్హులని వలంటీర్ల చేత ఒత్తిడి చేయడం సరికాదన్నారు. నాయకులు పరశురాముడు, ప్రసాద్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఆక్రమణదారునిపై చర్యలు తీసుకోవాలి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ



అక్రమ కట్టడం స్థలాన్ని పరిశీలిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించిన ఆదోని 18వ వార్డు కౌన్సిలర్ చిన్నపై చర్యలు తీసుకోవాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బండిమెట్ట, ఎంఎం కాలనీకి చెందిన ప్రజల కోసం అప్పటి ప్రభుత్వం ఆదోని మున్సిపాలిటీ నిధులతో 16 మురుగుదొడ్లను నిర్మించిందని తెలిపారు. ఈ నిర్మాణాన్ని కౌన్సిలర్ చిన్న కూల్చేసి, ఎవరేం చేస్తారనే అహంభావంతో ఏకంగా సొంతింటిని నిర్మించుకుంటున్నారని విమర్శించరు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ స్థలాన్ని ఇవ్వాలంటే దాదాపు 20 నుంచి 30 ఏళ్ల వరకు ఆ స్థలంలో నివాసం ఉండాలని తెలిపారు. స్థలంలో ఉన్న వ్యక్తి ఆ స్థలానికి సంబంధించిన పట్టా తనకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తే, ఆ స్థలం మున్సిపాలిటీకి పనికి రాదు అన్నప్పుడు కౌన్సిల్‌లో తీర్మానమైన తర్వాత కలెక్టర్‌కు, రీజనల్ డైరెక్టర్ ఆఫీస్ అనంతపురం వారికి స్థానికంగా మున్సిపల్ అధికారులు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఆ స్థలాన్ని లీజ్‌కు అగ్రిమెంట్ రాసిన తర్వాతనే మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ దగ్గరికి పట్టా ఇవ్వాలని రెకమండేషన్ పంపాలని చెప్పారు. ఆదోని మున్సిపాలిటీ అధికారు లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్థానికులు ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారికి చెప్పినా పెడచెవిన పెడతున్నారని చెప్పారు. స్థలానికి సంబంధించిన కొన్ని ఆధారాలు కలెక్టర్, అనంతపురం రీజనల్ డైరెక్టర్‌ను అందజేస్తామన్నారు. మున్సిపాలిటీ కి ఉపయోగపడే కార్యాలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలుగు యువత ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, సయ్యద్ వసీం ఖాద్రీ, గోపాల్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం శ్రీనివాసులు, నరసప్ప, భరత్, వీరేష్, బోయ వీరన్న, రమేష్, లింగయ్య, రాఘవేంద్ర రెడ్డి, బాబురావు, లక్ష్మిరెడ్డి, నాగేంద్ర ఉన్నారు.

కబ్జాకు పాల్పడలేదు : కౌన్సిలర్ చిన్న

ప్రభుత్వ నిబంధనల మేరకు ఆ స్థలానికి పట్టా ఇచ్చారని కౌన్సిలర్ చిన్న వివరణ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం తనపై గిట్టని వారు ఆరోపణలు చేయడం తగదన్నారు. స్థానికునిగా తనకు ఎలాంటి ఆస్తులూ లేవని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం వారు పట్టా ఇచ్చిన తర్వాతే నిర్మాణం చేపట్టామన్నారు. దీనికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధమూ లేదని, టిడిపి నాయకులు గమనించాలని తెలిపారు.



స్థలం పట్టా చూపిస్తున్న కౌన్సిలర్ చిన్న

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మండలంలోని తెర్నేకల్లు, కరివేముల, పి.కోటకొండ, గుండ్లకొండ, కె.వెంకటాపురం, కుంకనూరు, కప్పట్రాళ్ల, కెజిబివి ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, స్థానిక ప్రధానోపాధ్యాయులు బజారప్ప పర్యవేక్షించారు. ఈ మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించిన 9 ఉత్తమ సైన్స్ ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మండల విద్యాధికారులు

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ, ఇరుముడి ఉత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో శ్రీఅయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమం విరుపాక్షి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే 48 రోజులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, విరుపాక్షి స్వామి సొంత ఖర్చులతో అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవాని స్వాములు రూ.3 లక్షల వరకు అన్నదానం చేపట్టారు. ఊరేగింపు, ఇరుముడి, మహా పడిపూజ కార్యక్రమం విరుపాక్షి సొంత ఖర్చులతో నిర్వహించారు. వేలాది జనం మధ్యలో శ్రీబోగలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈ మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విరుపాక్షి గురు స్వామిని అయ్యప్ప భక్త మండలి ఘనంగా సన్మానించింది.



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు





బేతంచెర్లలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం

- మూడో రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- జిల్లా వ్యాప్తంగా మోకాళ్లపై నిలబడి నిరసన

రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం కొనసాగిస్తామని అంగన్ వాడీ వర్కర్లు, ఆయాలు నినందించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, వర్కర్లు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు పిలిపించి అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని, లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని అంగన్‌వాడీలు ప్రభుత్వానికి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్, టిడిపి, సిపిఐ, బిజెపి, కౌలు రైతు, రైతు, బిసి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. నంద్యాల, పాణ్యంలో మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందారెడ్డి, గౌరు చరితా రెడ్డిలు పాల్గొని సంఘీభావం తెలిపారు. (వార్త 6వ పేజీలో..)

వచ్చారు.. వెళ్లారు..

- హడావుడిగా కేంద్ర కరువు బృందం పర్యటన
- ఒక్క గ్రామంలోనే పంట పొలం పరిశీలన
- కరువు పరిశీలనపై రైతులు అసహనం
- సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు వినతులు సమర్పణ



మాట్లాడుతున్న రైతు కృష్ణా రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

కరువుతో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం వస్తుందని ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు గురువారం జిల్లాకు వచ్చిన కేంద్ర కరువు బృందం తీరును చూసి రైతులు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఉదయం పది గంటలకల్లా కేంద్ర కరువు బృందం సభ్యులు వస్తారని ఎదురు చూసిన రైతులు సాయంత్రం 5 గంటలైనా రాకపోవడంతో తీవ్ర నిరాశతో వెళ్లిపోయారు. సాయంత్రం 5:30 గంటల తర్వాత బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామానికి వచ్చిన కరువు బృందం కేవలం ఒక్క కంది పంట పొలాన్ని మాత్రమే పరిశీలించారు.

ఆర్ఎస్.రంగాపురంలో పంట పొలం పరిశీలన అనంతరం బందం సభ్యులు డా.అనురాధ.బి, సంతోష్, సంగీత్ కుమార్‌లు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన దెబ్బతిన్న కంది, పత్తి, జొన్న, మొక్కజొన్న, ఆముదం తదితర పంటల ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బేతంచేర్ల, పగిడ్యాల, మిడుతూరు మండలాల కరువు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి కేంద్ర కరువు బృందం అధికారులతో మాట్లాడుతూ కరువు సహాయక చర్యలను తక్షణమే చేపట్టి రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టపరిహారం జమ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, డిఎ హార్టికల్చర్ ఆఫీసర్ నాగరాజు, వెటర్నరీ అనిమల్ హస్బెండరీ ఆఫీసర్ గోవింద్ నాయక్, ఏడిఏ అశోక్ వర్ధన్ రెడ్డి, బేతంచెర్ల మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్, తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో వెంకన్న, ఏపీవో శేషన్న, రంగాపురం సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, డ్వామా కోర్స్ డైరెక్టర్ పరమేశ్వరుడు, వెటర్నరీ ఆఫీసర్ వసంత, పంచాయతీ సెక్రెటరీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని
రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల వినతి

బేతంచెర్ల మండలంలోని రైతులకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి ఆర్థికంగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్య, గౌరవాధ్యక్షులు కోయిలకొండ నాగరాజు కేంద్ర కరువు బృందానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 29 మండలాలకు గాను 6 మండలాలను మాత్రమే కరువుగా ప్రకటించడం సరైంది కాదన్నారు. కరువు ప్రాంతంగా ప్రకటించిన ప్రతి మండలంలోని రైతులకు ఎకరాకు రూ. 30 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. బేతంచెర్ల నగర పంచాయతీలో కూడా ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

డోన్, ప్యాపిలి మండలాలను
కరువుగా ప్రకటించాలి సిపిఐ వినతి

డోన్, ప్యాపిలి మండలాలను కూడా కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మండల కార్యదర్శి వై భార్గవ్, కేంద్రం కరువు బృందానికి వినతిపత్రం సమర్పించారు.

పెట్టిన ఖర్చు కూడా రాలేదు

మూడు ఎకరాలలో పత్తి పంట వేశాను. వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేయగా వర్షం జాడే లేక పంట ఎండిపోయింది. ఎకరాకు రూ. 15 వేల నుంచి 25 వేల దాకా ఖర్చు పెట్టాం. వర్షం పడకపోవడంతో ప్రస్తుతం పెట్టిన ఖర్చు కూడా రాలేదు. అప్పుల పాలయ్యాం.

- ఆర్ఎస్. రంగాపురం రైతు కృష్ణారెడ్డి (కష్టన్న).

ఆర్థికంగా నష్టపోయాం

కంది పంట ఆరు ఎకరాల్లో సాగు చేశాను. వర్షాలు రాకపోవడంతో పంట దిగుబడి పూర్తిగా పడిపోయింది. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఆర్ఎస్. రంగాపురం రైతు కాశీమన్న.



కంది పంటను పరిశీలిస్తున్న కేంద్ర కరువు బృందం



కేంద్ర కరువు బృందానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ - ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు
- కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ 36 గంటల ధర్నా, వంటావార్పు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ న్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాల అమలు, నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.ఏసురత్నం, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.లక్ష్మణ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 36 గంటల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. 60 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు పనిచేయించు కొని ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించకుండానే తొలగించటం సరైంది కాదన్నారు. 62 ఏళ్ల రిటైర్మెంట్ జిఒ వర్తింప చెయ్యాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో ఆశా వర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని, ప్రభుత్వం ఆశా వర్కర్స్కు గ్రూప్న్సురెన్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఆశావర్కర్స్ ప్రతిరోజు విలేజ్ క్లినిక్, సచివాలయాలలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయడం, ఓపీ వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు ఉదయం సాయంత్రం రెండు సార్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధించడం తగదన్నారు. రికార్డ్స్ సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ వర్క్‌లన్నీ సొంత ఫోన్ ద్వారా చేయాలని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. ఆశాలకు సెలవులు లేకపోవడంతో అనారోగ్యం పాలౌతున్నారని చెప్పారు. ఆశాలకు రిటైర్మెంటె బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చెయ్యాలని కోరారు. ఇళ్ళు లేని వారికి ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నారు. కోవిడ్ కాలంలో (2020 మార్చి నుండి) మరణించిన ఆశాలకు రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలన్నారు. మరణించిన కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలన్నారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియా మకాలలో ఆశాలకు వెయిటేజిని ఇవ్వాలన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినా నేటి వరకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే చలో విజయవాడకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, అధ్యక్షురాలు నాగమణి, జిల్లా నాయకురాళ్లు షమీమ్, శివమ్మ, శివలక్ష్మి, పిహెచ్‌సిల సెంటర్ నాయకురాళ్లు, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు ఏసురత్నం

ముస్తాబైన కర్నూలు

- నేటి నుంచి ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



ముస్తాబైన సుందరయ్య సర్కిల్

కర్నూలు నగరంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాగనున్న ఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కర్నూలు నగరం సిద్ధమైంది. కర్నూలులోని కలెక్టరేట్ కూడలి, సుందరయ్య కూడలి, ఆర్ఎస్ రోడ్డు కూడలి, గాయత్రి ఎస్టేట్ కూడళ్లను ఎఐకెఎస్ తోరణాలతో ముస్తాబు చేశారు. ప్రధాన రోడ్ల మధ్య భాగాల్లో తోరణాలు, జెండాలతో అలంకరించారు. సమావేశాల కోసం గురువారం సాయంత్రానికే ముఖ్య నాయకులు కర్నూలుకు చేరుకున్నారు. వారికి ఆహ్వాన సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఎఐకెఎస్ అఖిలభారత అధ్యక్షులు అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు విజూకృష్ణన్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో ఆహ్వాన సంఘం నాయకులు పిఎస్.రాధాకృష్ణ, గురుశేఖర్ స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో పలువురు నాయకులకు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆహ్వాన సంఘం నాయకులు నగేష్, అబ్దుల్లా స్వాగతం పలికారు. సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రారంభ సభ, కార్యదర్శి నివేదిక ఉంటాయి. మధ్యాహ్నం కర్నూలు సుందరయ్య కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ రైతు ర్యాలీ ఉంటుంది. శ్రీరామ థియేటర్, మౌర్యా ఇన్ కూడలి, రాజ్ విహార్ కూడలి, చిల్డ్రన్స్ పార్క్, ఓల్డ్ కంట్రోల్ రూం, కొండారెడ్డి బురుజు మీదుగా సాగనుంది. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 16, 17న కార్యదర్శి నివేదికపై చర్చలు, తీర్మానాలు ఉండనున్నాయి. 17న సాయంత్రానికి సమావేశాలు ముగియనున్నాయి. బస్టాండు సమీపంలోని సత్య ఇన్ హోటల్‌లో ఈ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల వేదికకు స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళనాడు రైతు ఉద్యమ నాయకులు శంకరయ్య పేరుతో శంకరయ్య నగర్‌గా నామకరణం చేశారు. సమావేశాలకు 27 రాష్ట్రాల నుంచి 140 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, టి.సాగర్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్ హాజరుకానున్నారు. వారితో పాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, నోయిడాలో రైతు ఉద్యమం నడిపిన నాయకులు, వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితులు రానున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అధికారంలో ఉన్నప్పుడు షాదీఖానా ఎందుకు నిర్మించలేదు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

నాడు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్ రెడ్డి పట్టణంలో ముస్లింల కోసం షాదీఖానాను ఎందుకు నిర్మించలేకపోయారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని కొండపేటలో ప్రముఖ న్యాయవాది అబ్దుల్ ఖైర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 'బనగానపల్లె పట్టణ ప్రజల్లో నీ ముసుగు తొలగిపోయింది. త్వరలోనే ప్రజలు నీకు బుద్ధి చెప్పే రోజులు ఉన్నాయి. పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతుంటే చూసి ఓర్వలేక ముస్లిం మైనారిటీలను వైసిపికి దూరం చేయాలనే దురాలోచనలతో షాదీఖానాను తెరమీదకి తీసుకువచ్చి కపట నాటకాలు ఆడుతున్నావు. నువ్వు చేస్తున్న పనులన్నింటినీ నియోజకవర్గంలోని ప్రజలందరూ గమనిస్తున్నారు. 2024 ఎన్నికల్లో మళ్ళీ బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పట్టణంలో ముస్లిములకు ప్రభుత్వం ఇంటి స్థలాలు పంచితే వైసిపికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న దురాలోచనతో మాజీ ఎమ్మెల్యే బీసీ హైకోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు' అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచి ఈసారి ఎల్లమ్మ, భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపిటిసి తాహిర్, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, నూకల వెంకట సుబ్బయ్య, సయ్యద్ సజ్జాత్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి కిషోర్ కుమార్, సునార్ ఎక్బాల్ హుస్సేన్, జిటి.వెంకటరామిరెడ్డి, లాయర్ సాజీద్ హుస్సేన్, గౌండా వలి, ఆటోనగర్ సయ్యద్, తెలుగుపేట మద్దయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - బేతంచెర్ల

కర్నూల్ నగరంలో ఈ నెల 15, 16, 17వ తేదీలలో జరుగు ఆలిండియా కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జిల్లాలోని రైతులు, ప్రజలు జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ కోరారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల గోడపత్రికలను రైతు సంఘం మండలం నాయకులు కృష్ణన్న, రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాజశేఖర్, వి.సుబ్బరాయుడు మాట్లాడుతూ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు నగరంలోని సుందరయ్య సర్కిల్ నుండి రైతుల మహా ప్రదర్శన ఉంటుందని చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు కర్నూలు పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులు జాతీయ కౌన్సిల్ సమావేశాలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్య, రైతు సంఘం గౌరవాధ్యక్షులు కోయిలకొండ నాగరాజు, కార్యదర్శి పుల్లెం రామ్మోహన్, శ్రీనివాసులు, రహంతుల్లా, రామ తిమ్మారెడ్డి, నాగన్న, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

జాతీయస్థాయి బాలోత్సవ్‌లో గురురాజా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల

గుంటూరు నగరం నంబూరులో జరిగిన వివిఐటి బాలోత్సవ్-2023 కాంపిటీషన్‌లో నంద్యాల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి 41 బహుమతులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పి షేక్షావల్ రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలోత్సవ్ కాంపిటీషన్‌లో జాతీయస్థాయిలో 60 విభాగాలలో 605 పాఠశాలల నుండి 16,000 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, రాయలసీమలో అత్యధిక బహుమతులు సాధించిన ఒకే ఒక్క పాఠశాల శ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అన్నారు. వివిఐటి బాలోత్సవ్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఎపి తెలుగు భాషా సంఘం అధ్యక్షులు విజయ్ బాబులు ప్రశంసించడం విద్యార్థుల విజయాలకు తార్కాణమన్నారు. ప్రతి విభాగంలో అత్యధిక బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల విజయాలకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి

సెవెన్ హిల్స్ హాస్పిటల్స్‌లో

కీళ్ల మార్పిడి రివిజన్ ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ మల్టీస్పెషల్టి హాస్పిటల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం గోపేపల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణారెడ్డికి మోకాలు కీళ్ల మార్పిడి రివిజన్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కె.క్రాంతి కిరణ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జి.కృష్ణారెడ్డి 8 సంవత్సరాల క్రితం తిరుపతిలో రెండు మోకాళ్ళకి కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నాడని తెలిపారు. కానీ అనుకొని విధంగా టూవీలర్ నుండి కింద పడటంతో కుడి కాలికి గాయమై విపరీతమైన ఇన్ఫెక్షన్స్ కావడంతో ఇన్ ప్లాంట్ తొలగించారని చెప్పారు. దీంతో రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడని తెలిపారు. అప్పటినుండి రివిజన్ ఆపరేషన్ కోసం హైదరాబాద్, తిరుపతి, చెన్నై పట్టణాలలో కన్సల్టేషన్ కోసం సంప్రదించగా రివిజన్ మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స సుమారు రూ. 7 లక్షల నుండి 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కృష్ణారెడ్డిని వైసిపి పుట్టపర్తి సమన్వయకర్త కొత్తకోట సోమశేఖర్ రెడ్డి పరామర్శించి నంద్యాలలో సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌లో కేవలం ఇంప్లాంట్ ఖర్చు పెట్టుకోగలిగితే ఆపరేషన్ మందులన్నీ ఉచితంగా అందజేస్తారని తెలియజేయడంతో ఇక్కడికి వచ్చాడన్నారు. శ్రీ కాత్యాయిని సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈయనకు కేవలం 3 లక్షల రూపాయల ఇంప్లాంట్ ఖర్చు అయిందని తెలిపారు. సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ డైరెక్టర్ రెంటాల మారుతి కుమార్ మాట్లాడుతూ ఇదివరకే శ్రీ కాత్యాయని సేవా ట్రస్టు ద్వారా సుమారుగా 15కి పైగా మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేసినట్లు తెలిపారు. మోకాళ్ల అరుగుదలతో బాధపడుతున్న వారు ఎటువంటి అపోహలు లేకుండా శ్రీ కాత్యాయని సేవా ట్రస్ట్ ద్వారా సంప్రదించి కీళ్ల మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేయించుకోవాలని చెప్పారు. కేవలం ఇంప్లాంట్ ఖర్చు మాత్రమే ఖర్చు అవుతుందని నంద్యాల, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మోకాల కీళ్ల మార్పిడి ఆపరేషన్‌కి సహకరించిన జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అనస్థీషియా డాక్టర్ మధుసూదన్ రెడ్డి వారి వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న డాక్టర్ క్రాంతి కిరణ్, డైరెక్టర్ మారుతి కుమార్



ఆపరేషన్ అనంతరం నడుస్తున్న జి.కృష్ణా రెడ్డి

అంగన్వాడీ కేంద్రాల సేవలు యధావిధిగా అందాలి

- సెంటర్లు మూతపడకుండా చూడాలి
- ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీల నిరవధిక సమ్మె సందర్భంగా చంటి పిల్లలు, గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సేవలు యధావిధిగా అందేలా చూడాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల ప్రత్యామ్నాయ సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు నిరవధిక సమ్మె చేస్తున్న సందర్భంగా అంగన్వాడీ సెంటర్లు మూతపడకుండా, చంటి పిల్లలు, గర్భిణీలకు సేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, ఐసిడిఎస్ సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఏపీఎంలు, డిప్యూటీ సీఈవో, డిఆర్‌డిఏ పిడి, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి సంబంధిత అంగన్వాడీ సెంటర్లను అనుసంధానం చేసి సేవలు యధాతథంగా జరిగేలా చూడాలని అదేశించారు. జిల్లాలో మెయిన్ అంగన్వాడీ సెంటర్లు 1620, మినీ అంగన్వాడీ సెంటర్లు 43 పని చేస్తున్నాయని,ఈ సెంటర్లద్వారా చంటి పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బాలామృతం, గర్భవతులకు, బాలింతలకు పంపిణీచేసే బియ్యం, బ్యాల్లు, నూనె, వైయస్సార్ కిట్టు లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందుకు పక్కగా ప్రణాళిక తయారు చేసుకొని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వున్న అంగన్వాడీ సెంటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గతంలో లాగానే నడిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి

- తెలుగు గంగ ఈఈ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగ ప్రధాన కాలవ ద్వారా పారుతున్న సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని తెలుగు గంగ ఈఈ శంకర్ రెడ్డి తెలిపారు. గురువారం రుద్రవరం మండలంలోని నల్లమల అటవీ సమీపంలోని తెలుగంగకాలవను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 2000 క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ కాలువకు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నీటిని ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే విడుదల చేస్తామన్నారు. అందువల్ల రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. 18వ ఉపకాలవకు నీటి సరఫరా తక్కువగా ఉండడంతో ఎర్రగుడిదిన్నె, పేరూరు తదితర గ్రామాల రైతులు నీటి సామర్థ్యాన్ని పెంచాలని ఈఈని కోరారు. దీంతో ఆయన కాలువకు 50 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని విడుదల చేయించారు. ఆయన వెంట పలువురు తెలుగంగ అధికారులు ఉన్నారు.



ఎమ్మెల్యే కాటసానికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏల సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే కాటసానికి విఆర్ఎల సంఘం వినతి

ప్రజాశక్తి - బనగానపల్లె

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగశేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి భూపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగ శేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి భూపాల్‌లు ఎమ్మెల్యే కాటసానామిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈనెల 15న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్లో సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామ సేవకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేని కోరారు. వీఆర్ఏలకు పేఏస్కేల్ అమలు చేయాలని, వీఆర్వో పోస్టులను భర్తీ చేయాలని, తదితర సమస్య లను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షులు బాలుడు, ప్రధాన కార్యదర్శి బాలకష్ణ, వీఆర్ఏలు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనందికొట్కూరు మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు స్వాములు, శ్రీనివాసులు, మునిస్వాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ శోభారాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిదినాల విధానం రద్దుచేసి ఫీల్డసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. పనిదినాల టార్గెట్ విధానం రద్దుచేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మూడు సంవత్సరాలు పూర్తిఅయిన అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు అందరికి ప్రమోషన్ సౌకర్యం కల్పించి మున్సిపాలిటి పరిదిలో విలినమైన గ్రామపంచాయతీలలో యదావిధిగా ఉపాధిహామీ పథకం అమలు చేయా లన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ఫీల్‌అసిస్టెంట్లకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు శాతన కోట స్వాములు,వడ్డేమాను శ్రీనివాసులు, నాగటూరు హైమావతి, బిజినవేముల పద్మావతి,మల్యాల స్వాములు,కొణిదెల పెద్ద శేషన్న,దామగట్ల మునిస్వామి, కోళ్లబాపురం భారతి, కొనేటమ్మ పల్లి సుధీర్, బ్రాహ్మణకొట్కూరు వలి, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ క్రీడలకు డిగ్రీ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మహబూబ్ బాషా సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకురాలు వి. విజయకుమారి గురువారం తెలిపారు. సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్ మహబూబ్ బాషా ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకురాలు వి. విజయకుమారి తెలిపారు. వ్యాయామ అధ్యాపకురాలు మాట్లాడుతూ సౌత్ జోన్ క్రీడలకు ఎంపికైన విద్యార్థి ఈనెల 18వ తేదీ కర్నూలులో శిక్షణ శిబిరంలో పాల్గొంటారని, అనంతర బెంగళూరులోని విశ్వేశ్వరయ టెక్నాలజీ యూనివర్సిటీలో ఈనెల 22 నుండి 25 వరకు జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని అని తెలిపారు. సౌత్ జోన్ క్రీడలకు ఎంపికైన మహబూబ్ బాషను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ స్వర్ణలతాదేవి , కళాశాల అధ్యాపకులు అభినందించారు.



సౌత్ జోన్ క్రీడలకు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి

బసవ పున్నయ్య సేవలు మరువలేనివి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

మార్క్స్,లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన వ్యక్తి మాకినేని బసవపునయ్య అని, ఆయన సేవలు మరువలేనివని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, సీనియర్ నాయకులు ఎం. రజాక్ అన్నారు. గురువారం బసవ పున్నయ్య 109వ జయంతి సందర్భంగా పట్టణంలోని డాక్టర్ ఏ ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పట్టణం కమిటీ ఆధ్వర్యంలో జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన నాయకులలో బసవ పున్నయ్య ఒకరని అన్నారు. భారతదేశం లోనూ అంతర్జాతీయ కమ్యూ నిస్టు ఉద్యమంలో వచ్చిన వక్రీకరణ లకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాటం కొనసాగించారు. స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూతో కలిసి పని చేసిన వ్యక్తి మాకినేని అన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించాడని అన్నారు. జమీందారులకు వ్యతిరేకంగా దోపిడీ లేని పేదరికం నిరుద్యోగం లేని సమాజాన్ని నిర్మించాలని ఆయన కృషి చేశారని అన్నారు. ఆయన జీవిత కాలమంతా రాజీ పడకుండా కమ్యూనిస్టు ప్రమాణాలకు నిర్మాణానికి లోబడి పని చేసిన నాయకుడని అన్నారు. నేటితరం వారు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాబాష, సుధాకర్, డి రామ్ నాయక్, వీరన్న, కిరణ్, మహమ్మద్, సామెలు, మల్లయ్య, రాముడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాకినేని బసవపున్నయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నేతలు



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

వైసిపి పాలనకు 2 నెలలే గడువు : టిడిపి

ప్రజాశక్తి - విలేకరులు

ప్యాపిలి : ఎపిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఇంకా రెండు నెలల సమయమే ఉందని తెలుగుదేశం పార్టీ డోన్ ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం బావి పల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ పని అయిపోయినట్లేనన్నారు. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తాజాగా యూనిట్‌కు 40 పైసలు బారం వేశారని ఆర్టీసీ ఛార్జీలు పెంచుతున్నారన్నారు. చెత్త పన్ను ఆరు నెలలకు ఒకసారి ఆస్తి పన్నులో కలిపి వసూలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని ఆయన నినదించారు. ప్రస్తుతం పార్టీకి లభిస్తున్న స్పందన ఆదరణ చూస్తే స్పష్టంగా వచ్చే ఎన్నికల్లో గెలిచేది తెలుగుదేశం పార్టీనే అన్నారు. అదేవిధంగా వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. పార్టీలో చేరినవారిలో చిన్న సుంకన్న,జ్యోతి శ్వరుడు నడిపెన్నగారి రాము, రమేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, లక్ష్మి నారాయణ యాదవ్, రామసుబ్బయ్య, బట్ట సత్యం, సుదర్శన్, హరూన్,తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి పెరుగుతున్న ఆదరణ : మాజీ మంత్రి అఖిలప్రియ

ఆళ్లగడ్డ : నియోజకవర్గంలో టిడిపికి రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. భూమా అఖిల ప్రియా గుండంపాడు గ్రామానికి చేరుకోగానే ఘన స్వాగతం పలికారు. శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెందిన 75 కుటుంబాల వారు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పుల్లారెడ్డి కుమార్తె గుండంపాడు సర్పంచ్ సంగిరెడ్డి మౌనికతో పాటు 75 కుటుంబాలు, నలుగురు వార్డు సభ్యులు టిడిపిలో చేరారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ వారికి ఘనంగా స్వాగతం పలికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్ నాయుడు, సిరివెళ్ల మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని తాలుకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కొత్త మసీదు వీధి, బృందావనం కాలనీలలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారంటీ ద్వారా ప్రతి కుటుంబానికి మంచి భవిష్యత్తు ఉండేలా టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో తయారు చేసినట్లు తెలిపారు. యువతకు ఉపాధి, రైతులకు భరోసా, అన్ని వర్గాలకు సంక్షేమం టిడిపితోనే సాధ్యమన్నారు. కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాష, టిడిపి నాయకులు నన్నే బాయ్ గారి జిలాన్, చిన్న కందుకూరు మాధవరెడ్డి, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

చాగలమర్రి : రాష్ట్రంలో వైసిపి పాలన గాడి తప్పిందని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష ఆరోపించారు. గురువారం స్థానిక గుంత పాలెం కాలనీలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల పెరుగుదల, డీజిల్, పెట్రోల్, విద్యుత్ చార్జీల పెంపు చివరికి చెత్తపై పన్నులు విధిస్తూ ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు మదార్ సాహెబ్, జింక చిన్న మదరవల్లి, పెద్ద మొహమ్మద్, క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్, ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఆలంశ గారి హనీఫ్, రియాజ్, వీరమ్మ గారి కాజా రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలుగా గుండా నాగ సుప్రజ

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణానికి చెందిన గుండా నాగ సుప్రజ నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య మహిళ మండలి నూతన మహిళా అధ్యక్షురాలిగా బనగానపల్లె పట్టణానికి చెందిన గుండా సుప్రజ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఎన్నికల అధికారి జయంతి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళ మండలి నూతన అధ్యక్షురాలిగా గుండా సుప్రజ పేరును ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి సభ్యురాలిగా ఎన్నికైన గుండా సుప్రజ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ తొలి మహిళా గవర్నర్‌గా, మోటివేషనల్ ట్రైనర్‌గా, సమ రత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్‌గా ఉమ్మడి కర్నూలు నంద్యాల జల్లాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం బనగానపల్లె ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవ సలహాదారుగా ఉన్నారు. ఈ సందర్భంగా గుండా నాగసుప్రజ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఎంతో బాధ్యతతో కూడుకున్న నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా సం ఘం అధ్యక్షురాలిగా టిజి వెంకటేష్ ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మహిళా సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జనవరి నెలలో టీజీ వెంకటేష్ నేతృత్వంలో అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. తాను ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికయ్యేందుకు సహకరించిన నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్తకు, అధ్యక్షుడు భవానాసి నాగ మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గుండా మురళీధర్, బనగానపల్లె సాయిబాబా మందిరం అధ్యక్షులు శ్రీరామ సుబ్రమణ్యం, బేతంచర్ల, బనగానపల్లె, పాణ్యం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య మహిళా జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన గుండా నాగ సుప్రజ ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

స్కావెంజర్స్ సమస్యలు పరిష్కారించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్కావెంజర్స్‌లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు శంషాద్ బి, ముబారక్‌లు అన్నారు. గురువారం పట్టణంలో ఎంఈఓ కార్యాలయం దగ్గర మధ్యాహ్న భోజన కార్మికుల సమస్య లు పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారి జానకి రామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు చెల్లించాలన్నారు. నిత్యవసర ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అహమ్మద్ బి, రమీజాబీ, మేరమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ, బేగంబి, తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు



దర్శనం అనంతరం ప్రముఖులతో ఆలయ అధికారులు

శ్రీశైలంలో ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను గురువారం నాడు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖులలో ఇన్కమ్ టాక్స్ ఐఆర్ఎస్ చీఫ్ కమిషనర్ కె వెంకట నరసింహచారి, డాక్టర్ బి మల్లికార్జున, ప్రిన్సిపల్ కమిషనర్, టిఆర్ఎస్ హైదరాబాద్ ఇన్కంటాక్స్ కమిషనర్, కె రవి కిరణ్ తదితరులు ఉన్నారు. వీరందరూ కలిసి స్వామి అమ్మవార్లను దర్శించు కునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ అధికా రులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ముం దుగా స్వామివారిని ఆ తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా శేష వస్త్రాలను ప్రసాదాలను జ్ఞాపకను అధికారులు అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

17న నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇంటి వద్ద నిత్యవసర సరుకులు తీసుకోని వారు ప్రతి నెల 17వ తేదీన సచివాలయాల వద్ద నిత్యవసర సరుకులు తీసుకునే అవకాశం కల్పించడం జరిగిం దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రైస్ కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, రాగులు సబ్సిడీ ధరలపై చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి, ప్రతి మాసము ఎండియూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నయెడల 1967 టోల్ ఫ్రీ నెంబరుకు తెలపాలన్నారు.

కొనసాగిన గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

తమ డిమాండ్ల సాధనలో భాగంగా ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు ఆళ్లగడ్డ గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు ఈ నెల 12 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆళ్లగడ్డ పాత బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ శాఖ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయరాముడులు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని మరియు పెన్షన్తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షలకు పెంచాలని, గ్రాడ్యూటీ 5 లక్షలకు పెంచాలని, టార్గెట్లు మేలాల రూపంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపివేయాలని తదితర డిమాండ్లతో నిరసన చేయడం జరిగిందన్నారు. తమ డిమాండ్లను ఆమోదించేంతవరకు నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందన్నారు.



నాలుగు రోడ్ల కూడలిలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం



దోన్ : మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల రూరల్ : నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరవధిక సమ్మె మూడోరోజు గురువారం కొనసాగింది. నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సమ్మెకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం,రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్‌కి టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి జెవి.మనోహర్ రెడ్డి, నంద్యాల, గోస్పాడు మండల కన్వీనర్లు గురునాథ్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, మహిళా కార్యదర్శి గుర్రంలక్ష్మీ, రాజశేఖర్, సునీల్, నాగేశ్వర రావు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలో సిఐటియు నాయకులు జిల్లా కార్యదర్శి టి.శివరాం, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.శేబారాణి,సిఐటియు పట్టణ, మండల అధ్యక్షులు లక్కీశ్రీకాంత్, పి. రామాంజనేయులు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సులోచన,రహమద్బి, సుమలత వరలక్ష్మి,రామేశ్వరి అంగన్ వాడీ కార్యకర్తలు,ఆయాలు పాల్గొని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట టెంటులో వినూత్న రీతిలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. **టిడిపి మద్దతు :** తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, బీసీ సెల్ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు ప్రజా వైద్యశాల మల్లికార్జున,డోన్ పట్టణ అధ్యక్షులు సీఎం.శ్రీనివాసులు, కార్యదర్శి రఫీ,జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లి గోవిందు, ప్యాపిలి మండల అధ్యక్షులు రామసుబ్బయ్య,కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, కాజా హుస్సేన్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.దీక్షా శిబిరం ముందు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. **రుద్రవరం :** స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో మోకాళ్లపై నిల్చుని అంగన్‌వాడీలు సమ్మె నిర్వహించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్, నాయకులు సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. బిబి, మనోజా, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు మోకాళ్ళపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్ష వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కేయండి గౌస్, జిల్లా కార్యదర్శి బాల వెంకట్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సిఐటియు పట్టణ కార్యదర్శి రమేష్ బాబులు మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. నాగమణి, మౌనిక, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, హుస్సేనమ్మ, గౌసియా, శశికళ, ఉమాదేవి, లక్ష్మీకుమారి, నాగలక్ష్మి, లక్ష్మీ, సుధామణి, సిహెచ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోనే ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బనగానపల్లె ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు వెంకటమ్మ అధ్యక్షత సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు టిడిపి పాణ్యం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఎంపిటిసి రంగా రమేష్, రమణమూర్తి, లాయర్ బాబు, హనుమంతు, సునీల్, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, వనం వెంకటాద్రి, ఆటో యూనియన్ నాయకుడు నాగరజు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం సుధాకర్, వికలాంగుల సంఘం జిల్లా నాయకులు దేవరాజు, బిసివై పార్టీ నాయకురాలు సుగుణమ్మ, సిపిఎం నాయకులు దావీదు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ మండల నాయకులు పద్మావతి, శ్రీదేవి, ప్రభావతి, భాగ్యలక్ష్మి, త్రివేణి, మహాలక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. యుటిఎఫ్ నాయకులు సుంకన్న, నారాయణరెడ్డి, రమణయ్యలు మద్దతు తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, అనిత, రేణుక, త్రివేణి, ఓలమ్మ, లీలావతి, ప్రభావతి, జ్యోతి, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ల తాళాలు ఇవ్వాలని కోరిన ఎంపిడిఒ : అంగన్వాడీ కేంద్రాల తాళాలు ఇవ్వాలని ఎంపిడిఒ సాయికృష్ణ, ఏసిడిపిఒ రోజారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ చిట్టెమ్మలు అంగన్వాడీ వర్కర్లను అడిగారు. తమ డిమాండ్లను సాధించుకునేంత వరకు తాళాలు ఇవ్వబోమని అంగన్‌వాడీలు భీష్మించారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ నందు మోకాళ్ళపై నిలిచి మానవహారం నిరసన తెలిపారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసి డిప్యూటీ తాసిల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీలపై అవమానకరంగా మాట్లాడిన బొబ్బిలి ఎమ్మెల్యే వెంకట చిన్నప్పల్ నాయుడు శాసన సభ్యత్వాన్ని రద్దుచేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ వ్యవస్థను నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని, అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్లో రూ. 25 వేల కోట్లు నుండి రూ. 15 కోట్లకు తగ్గించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో చర్చలు జరిపి పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నాగన్న, వ్యకాసం మండల అధ్యక్షుడు సంపంగి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు రంగమ్మ, జయరాణి, తదితరులు పాల్గొన్నారు. **జూపాడు బంగ్లా మండలంలో** తహశీల్దార్ కార్యాలయం వద్ద న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, వెంకట రమణమ్మ, ప్రసన్న మాట్లాడారు. **ఆత్మకూరు:** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె 3రోజు చేపట్టారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ తదితరులు పాల్గొన్నారు. **రైతు సంఘం, కౌలు రైతు, వ్యకాసం సంఘాలు మద్దతు :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, కార్యదర్శి వీరన్న, నాయకులు కిరణ్, సామేలు మద్దతు తెలిపారు. **విఆర్ఏల మద్దతు :** అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏ జిల్లా కార్యదర్శి భూపాల్, గౌరవ అధ్యక్షులు మూర్తుజా, అధ్యక్షులు శీను, నాయకులు లింగస్వామి, భాగ్యమ్మ, రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ నాయకురాలు విజయలక్ష్మి, ప్రియాంక, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, సిఐటియు నాయకులు మహమ్మద్, సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల:** సమ్మె విరమించుకోకపోతే అంగన్వాడీలను తొలగిస్తామని బెదిరిం పులకు పాల్పడడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు అన్నారు. బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నందు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్కె నాగలక్ష్మి, ఎస్ గుల్జార్బి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిరసన తెలిపారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండిపెంటలో అంగన్వాడీ వర్కర్లు మోకాళ్ళ మీద నిలబడి నిరసన తెలియజేశారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు రమణమ్మ, కాశమ్మ, ఏఐటీయూసీ నాయకులు, బిజెపి మండల నాయకులు గెల్లి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి, మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదము పాల్గొని మాట్లాడారు. **వెలుగోడు మండలంలో** తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, వెలుగోడు సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, వెలుగోడు మండల అంగన్వాడి నాయకు రానులు భాగ్యలక్ష్మి, అనిత మాట్లాడారు. వెలుగోడు మండల టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, మాజీ ఎంపీటీసీ జాకీర్ హుస్సేన్, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ ఖలీలుల్లా ఖాన్, యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ, నాగ స్వామి నాయక్, రఫిక్, వెలుగోడు సిఐటియు లోడింగ్ అన్ లోడింగ్ బజార్ హమాలీ నాయకులు వెంకటయ్య, కృష్ణ, తదితరులు అంగన్వాడీలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. **పగిడ్యాల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి మాట్లాడారు. **పాములపాడు:** పలు డిమాండ్లతో అంగన్వాడీలు కొనసాగిస్తున్న సమ్మెలో మూడో రోజు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్ గోపాల్, వ్యకాసం జిల్లా నాయకులు బాలయ్య అంగన్వాడీలకు పూర్తి మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు శివలక్ష్మి, నాగమద్దమ్మ, రవణబాయి, నాగమణి పాల్గొన్నారు. **చాగలమర్రి:** స్థానిక కేరళ ఆస్పత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నాయకురాలు పద్మావతి, వసంత, నాగమణి, వై పద్మావతి, ఏఐటీయూసీ నాయకురాల ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి గడ్డి తింటూ నిరసన తెలిపారు. వీరికి టిడిపి, ప్రజా సంఘాల నాయకులు మద్దతును సంఘీభావాన్ని తెలిపారు. **మిడుతూరు :** యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి డి సుబ్బమ్మ, జి లక్ష్మి కుమారి అధ్యక్షతన అంగన్వాడీలు సమ్మె మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పి పకీరు సాహెబ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్ బాబు మాట్లాడారు. వ్యకాసం జిల్లా నాయకులు టి ఓబ్లేస్, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్‌లో** అంగన్వాడీ వర్కర్లు మోకాళ్లపై కుర్చొని నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతుగా బండి ఆత్మకూరు మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు జీ రంగస్వామి, సభ్యులు జమాల్ బాషా, సౌఖత్ అలీ, సురేష్, రామరాజు తదితర విలేకరులు ప్రకటించారు. అదేవిధంగా మండల వ్యకాసం అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి డేవిడ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, సిఐటియు నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు మోకాళ్ళ మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీలు నాగమణి, రమణమ్మ, శ్రీదేవి, లలిత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల రూరల్ : మాట్లాడుతున్న నాయకులు



పాణ్యం : మాట్లాడుతున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు



పాములపాడు: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు